





# DD9 వార

తెలుగు దినపత్రిక


## కల్వకుంట్ల కవిత పార్టీ ప్రకటన సభకు అట్టహాసంగా ఏర్పాట్లు

పార్టీ ప్రకటన సభకు సర్వాంగ సుందరంగా ముస్తాబైన ప్రొఫెసర్ జయశంకర్ సార్ ప్రాంగణం
గన్ పార్క్ లో అమరవీరులకు నివాళులర్పించి మునీరాబాద్ బయల్దేరనున్న కవిత
ఉదయం 10 గంటలకు పార్టీ పేరు ప్రకటన, జెండా ఆవిష్కరణ
33 జిల్లాల నుంచి తరలిరానున్న 50 వేల మంది కార్యకర్తలు




సంపుటి : 02 సంచిక : 256 హైదరాబాద్, ఏప్రిల్, శనివారం 25, 2026 పేజీలు : 06 వెల : 3.00

# ప్రభుత్వంతో ఆర్టీసీ చర్చలు సఫలం

## విలీనంపై మంత్రుల బృందం గ్రీన్ సిగ్నల్


మూడు ప్రధాన డిమాండ్లకు సర్కార్ ఆమోదం
ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు కార్యాచరణ
కార్మిక సంఘాల ఎన్నికల నిర్వహణకు పచ్చజెండా
2021, 2025 పీఆర్సీ బకాయిలు, ఫిట్‌మెంట్ చెల్లింపు
ప్రైవేటు, ఎలక్ట్రిక్ బస్సులు వచ్చినా ఉద్యోగ భద్రత
సమ్మె రెండో రోజే చర్చలకు పిలిచిన సీఎం చొరవపై ప్రశంసలు
మహాలక్ష్మి పథకం నష్టాలను భరిస్తూ ఆదుకోవడంపై చర్చ
ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాల చెల్లింపుపై హర్షం
దశాబ్దాల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) కార్మిక సంఘాల జేఏసీ ప్రతినిధులతో ప్రభుత్వ కమిటీ జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. సమ్మెకు దారితీసిన మూడు ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవడంతో వివాదం కొలిక్కి వచ్చింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలోని మంత్రుల బృందం కార్మిక నేతలతో సుదీర్ఘంగా చర్చలు జరిపింది. ఈ సమావేశంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ఒక నిర్దిష్ట కాలపరిమితిలోగా పూర్తి చేసేందుకు

..మిగతా 2లో



# ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతి





హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత
డిపో వద్ద నిప్పంటించుకున్న ఉదంతంతో అట్టుడికిన నర్సంపేట
బహిరంగ సభలు, ఆందోళనలతో హోరెత్తించిన ఆర్టీసీ కార్మికులు
క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్, సీపీ, ఉన్నతాధికారులు
మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే దొంతిరెడ్డి రూ. 5 లక్షల ఆర్థిక సాయం
ముత్తోజీపేటలో పోలీసుల ఆంక్షలు.. రాజకీయ నేతల మధ్య వాగ్వాదం
పది లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ప్రకటించిన ప్రభుత్వం

**నర్సంపేట, (డిడి9 వార్త):** వరంగల్ జిల్లా నర్సంపేట డిపోలో ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్‌గౌడ్ చికిత్స పొందుతూ మరణించారు. గురువారం నర్సంపేట బస్టాండ్‌లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న ఆయన పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ కంచన్‌బాగ్‌లోని డీఆర్డీవో అపోలో ఆసుపత్రికి తరలించారు. సుమారు 85 నుంచి 95 శాతం మేర కాలిన గాయాలతో ఉన్న శంకర్‌గౌడ్‌కు వైద్యులు వెంటిలేటర్‌పై అత్యవసర చికిత్స అందించారు. రక్తపోటు పడిపోవడం, గొంతులో వాపు పెరగడంతో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారి ప్రాణాలు విడిచారు. ఈ వార్త తెలియగానే నర్సంపేట డిపో పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తోటి ఉద్యోగులు, కార్మికులు భారీ ఎత్తున నిరసనలకు దిగారు. కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం వల్లే శంకర్‌గౌడ్

..మిగతా 2లో

వాహనదారుల తప్పిదాలతోనే

# ప్రమాదాలు

రోడ్డు ప్రమాదాలపై డీజీపీ శివధర్ రెడ్డి ఆందోళన
ప్రమాదాల కారణంగా రోజుకు 20 కుటుంబాల్లో విషాదం
ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనే ఘటనలకు ప్రధాన కారణం
హెల్మెట్, సీట్ బెల్ట్ ధరిస్తే ప్రాణాపాయం తప్పే అవకాశం
రహదారులపైసైన్‌బోర్డులకొరతను గుర్తించిపోలీసులచర్యలు
ఫీడర్ రోడ్ల నుంచి ప్రధాన రహదారులకు వచ్చే చోట అప్రమత్తత
'ఎరైవ్-ఎలైవ్' కార్యక్రమం ద్వారా 16 శాతం తగ్గిన ప్రమాద మరణాలు
ట్రాఫిక్ చలానాలపై డిస్కౌంట్లు, రాయితీలు ఉండవని వెల్లడి
కఠిన నిర్ణయాల ద్వారానే ప్రమాదాలను ఆపగలమని స్పష్టం




# కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు ఊరట

15 ఏళ్ల నాటి 'మిలియన్ మార్చ్' కేసు కొట్టివేసిన హైకోర్టు
తెలంగాణ ఉద్యమ కాలం నాటి పాత కేసుల నుంచి విముక్తి
2011 ట్యాంక్‌బండ్ మిలియన్ మార్చ్ ఘటనపై కీలక తీర్పు
రాజకీయ కారణాలతో కూడిన కేసులను కొనసాగించాల్సిన పని లేదు
ఉమ్మడి పాలనలో నమోదైన ఆరోపణలను కొట్టివేసిన న్యాయస్థానం
ఉద్యమ నేతలపై ఆంక్షల ధిక్కరణ కేసులకు తెర
శాంతి భద్రతల విఘాతం ఆరోపణల్లో వాస్తవం లేదని వెల్లడి
హైకోర్టు నిర్ణయం పట్ల బీఆర్ఎస్ శ్రేణుల హర్షా తిరేకాలు
రాష్ట్ర సాధన పోరాటంలో అక్రమ కేసులు పెట్టారని నేతల వాదన



**హైదరాబాద్, (డిడి9 వార్త):** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా పార్టీ కీలక నేతలు కేటీఆర్, హరీశ్ రావులకు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఒక పాత కేసును న్యాయస్థానం శుక్రవారం కొట్టివేస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. తెలంగాణ మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న సమయంలో దాదాపు 15 ఏళ్ల క్రితం ఈ కేసులు నమోదయ్యాయి. 2011 మార్చి 10వ తేదీన హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన 'మిలియన్ మార్చ్' సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాల ఆధారంగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ చట్టపరమైన చర్యలు చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిర్వహించిన ఆందోళనలో ఆంక్షలు ఉల్లంఘించారని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించారనే నెపంతో పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులపై సుదీర్ఘ కాలం పాటు విచారణ కొనసాగినప్పటికీ, చివరకు రాజకీయ ప్రేరేపిత

..మిగతా 2లో

# కమలం గూటికి మల్లారెడ్డి కుటుంబం?

బీజేపీ ఆఫీస్‌కు మల్లారెడ్డి కోడలు.. రాజకీయాల్లో హాట్ టాపిక్!!
గత కొన్ని రోజులుగా బీజేపీ చేరికపై వార్తలు
కార్యాలయ సందర్శనతో ఊహాగానాలకు బలం
త్వరలో అధికారిక నిర్ణయం
ఉండొచ్చని రాజకీయ వర్గాల అంచనా
మల్లారెడ్డి గ్రూప్ యూనివర్సిటీస్
AI క్యాంపస్ ప్రారంభోత్సవానికి ఆహ్వానం




**మేడ్చల్ , (డిడి9 వార్త):** మేడ్చల్ రాజకీయాల్లో బలమైన పట్టున్న మల్లారెడ్డి కుటుంబం త్వరలో 'కాషాయ' కండువా కప్పుకోబోతుందా? అనే సందేహాలకు బలం చేకూర్చేలా తాజాగా ఒక కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి ఇవాళ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లారు. ఈ మేరకు ఆమె బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వచ్చే నెలలో తమ విద్యా సంస్థల ఆధ్వర్యంలో

..మిగతా 2లో

# శంకర్ గౌడ్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలన్న డిమాండ్
ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పరిస్థితి తీవ్రత
ఎన్నికల హామీల అమలుపై ప్రశ్నలు
మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర ఆవేదన



**హైదరాబాద్, (డిడి9 వార్త):** ఆర్టీసీ కార్మిక సోదరుడు శంకర్ గౌడ్ ఆత్మబలిదానం మా హృదయాలను తీవ్రంగా కలిచివేసిందని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. సంస్థను కాపాడేందుకు, కార్మికుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన శంకర్ గౌడ్‌కు ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ పంచుకున్నారు. "హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలి తప్ప, ఇలాంటి ఆత్మబలిదానాలకు ఎవరూ ఒడిగట్టవద్దని హృదయపూర్వకంగా మనవి చేస్తున్నాం. శంకర్‌గౌడ్ మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే బాధ్యత. ఈ ప్రభుత్వ అలసత్వం, నిర్లక్ష్యం వల్ల ఇలాంటి పరిస్థితి వచ్చింది. అధికారంలోకి రాగానే ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని,

..మిగతా 2లో

# శంకర్ గౌడ్ ది ఆత్మహత్య కాదు.. రేవంత్ సర్కార్ చేసిన హత్య

ఈ ఉదయం మృతి చెందిన శంకర్ గౌడ్
పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు అనుమతించకపోవడం దుర్మార్గమన్న కేటీఆర్
అరెస్ట్ చేసిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్



**హైదరాబాద్, (డిడి9 వార్త):** నర్సంపేట ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన 'హత్య' అని ఆయన అన్నారు. శంకర్ గౌడ్ పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. అరెస్టు చేసిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సహా కార్మిక నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు ఆత్మహత్యాయత్నం చేయడం తెలంగాణ చరిత్రలో ఒక 'చీకటి రోజు' అని,

..మిగతా 2లో

# ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతి

మొదటిపేజీ తరువాయి

బలిదానం చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో బస్టాండ్ ప్రాంగణం హోరెత్తిపోయింది. ఈ ఘటనపై విపక్షాలు తీవ్రంగా స్పందిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

శంకర్‌గౌడ్ మృతి పట్ల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుడు ఆసుపత్రిలో ఉన్న సమయంలోనే పరామర్శించి ధైర్యం చెప్పిన మంత్రి, ఇప్పుడు కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్మికులు ఎవరూ క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ జేఏసీతో చర్చలు కొనసాగుతున్నాయని, సానుకూల నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. నర్సంపేట ఆర్డీవో ఉమారాణి ప్రభుత్వం తరపున మృతుడి కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. దీంతో పాటు శంకర్‌గౌడ్ కు మారుడికి ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే దొంతిరెడ్డి మాధవరెడ్డి తన వంతుగా రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. అధికారుల హామీలతో కార్మికులు కొంత శాంతించినా, సమస్యల పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు.

ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించకుండా ప్రైవేటు డ్రైవర్లతో బస్సులను నడిపించడాన్ని నిరసిస్తూ శంకర్‌గౌడ్ ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు కార్మికులు చెబుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు చేపట్టారు. రోజువారీ వేతనం కింద డ్రైవర్లకు రూ. 1,500, కండక్టర్లకు రూ. 800 ఇచ్చేలా నోటిఫికేషన్లు జారీ చేశారు.



మరోవైపు జేఏసీ నేతలు ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లను ఉంచారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించడం, 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ అమలు చేయడం వంటి అంశాలపై పట్టుబట్టారు. అన్ని అంశాలపై స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని కార్మికులు తేల్చి చెప్పారు. ముత్తోజీపేటలో మృతదేహం తరలింపు సమయంలో పోలీసులు, రాజకీయ నేతల మధ్య జరిగిన వాగ్వాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.



## ప్రభుత్వంతో ఆర్టీసీ చర్చలు సఫలం

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం అంగీకరించింది. ఇతర రాష్ట్రాల్లో అనుసరించిన విలీన నమూనాలను ఇప్పటికే అధికారులు అధ్యయనం చేశారని, ఆ నివేదికల ఆధారంగా ముందుకు వెళతామని మంత్రులు హామీ ఇచ్చారు. అలాగే కార్మిక సంఘాల (ట్రేడ్ యూనియన్) ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం తన వైపు నుంచి అంగీకారం తెలిపింది. యాజమాన్యంతో చర్చించి త్వరలోనే ఎన్నికల షెడ్యూలు ఖరారు చేసుకోవాలని సూచించింది. ఆర్టీసీ కార్మికులకు అత్యంత కీలకమైన 2021 మరియు 2025 వేతన సవరణ (పీఆర్సీ) బకాయిలు, ఫిట్‌మెంట్‌ను చెల్లించేందుకు ప్రభుత్వం ఆర్థికపరమైన హామీ ఇచ్చింది. ప్రభుత్వ నిర్ణయాలతో సంతృప్తి చెందిన జేఏసీ ప్రతినిధులు సమ్మె విరమణపై అధికారిక ప్రకటన చేసేందుకు సిద్ధమయ్యారు.

చర్చల సందర్భంగా కార్మికుల ఉద్యోగ భద్రతపై ప్రభుత్వం గట్టి భరోసా ఇచ్చింది. భవిష్యత్తులో ప్రైవేటు బస్సులు, అద్దె బస్సులు లేదా ఎలక్ట్రిక్ వాహనాలు ఎన్ని వచ్చినా ప్రస్తుత ఉద్యోగుల విధులకు ఎటువంటి ఆటంకం కలగదని మంత్రులు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 52 రోజుల పాటు సమ్మె చేసినా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కనీసం చర్చలకు పిలవలేదని, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించారని జేఏసీ నేతలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం సమ్మె ప్రారంభమైన రెండో రోజే స్వచ్ఛందంగా చర్చలకు ఆహ్వానించడాన్ని వారు కొనియాడారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రులు, అధికారుల కమిటీ వేగంగా స్పందించి సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేశారని చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది. మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీకి తగ్గుతున్న ఆదాయాన్ని ప్రభుత్వం రీఇంబర్స్ చేస్తూ సంస్థను కాపాడుతోందని, కార్మికుల క్షేమంపై ప్రభుత్వానికి స్పష్టమైన చిత్తశుద్ధి ఉందని నేతలు అభిప్రాయపడ్డారు.

గతంలో జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని అనిశ్చితి ఉండేదని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు అందడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం ఇప్పటికే క్లియర్ చేసిందని, ఇప్పుడు పీఆర్సీ బకాయిలను కూడా ఒక షెడ్యూలు ప్రకారం విడుదల చేసేందుకు ఏకాభిప్రాయం కుదిరిందని తెలిసింది. విలీనం ప్రక్రియలో ఉన్న చట్టపరమైన చిక్కులను అధిగమించేందుకు మరిన్ని దఫాలుగా చర్చలు జరపాలని నిర్ణయించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు ఈ రెండేళ్ల కాలంలోనే పరిష్కారం కావడం విశేషమని కార్మిక నేతలు పేర్కొన్నారు. 2013 నాటి బాండ్లకు సంబంధించిన రూ. 280 కోట్లు, 2017 పీఆర్సీ పాక్షిక బకాయిలు విడుదల కావడం తమకు ఊరటనిచ్చిందని చెప్పారు. గతంలో సర్వీసు నుండి తొలగిపోయిన 270 మందికి తిరిగి ఉద్యోగాలు రావడం, సహకార సొసైటీ బకాయిలు తీరడం వంటివి ప్రభుత్వ సానుకూల ధోరణికి నిదర్శనమని జేఏసీ నేతలు వెల్లడించారు. యూనియన్లు లేకపోవడం వల్లే ప్రభుత్వ అద్భుతమైన కార్యక్రమాలు కార్మికుల్లోకి వెళ్లలేదని, ఎన్నికల నిర్వహణతో ఆ లోటు తీరుతుందని మంత్రులకు వివరించారు.

## శంకర్ గౌడ్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

మొదటిపేజీ తరువాయి

ఇతర అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి మాట తప్పడంవల్లనే ఈ దుస్థితి వచ్చింది. మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు సైతం అమలు చేయకుండా ఇంకెన్నాళ్లు కాలం గడుపుతావు రేవంత్ రెడ్డి? ఇలా ఎంతమందిని బలి తీసుకుంటావు? ఆర్టీసీ కార్మికుల న్యాయమైన ఆవేదనను పరిగణలోకి తీసుకొని, ప్రభుత్వం తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభించి, కార్మికుల్లో విశ్వాసం కల్పించాలి. శంకర్ గౌడ్ అమరుడైన రోజును "అప్పాయింటెడ్ డే"గా ప్రకటించి, ఆయన త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఆర్టీసీ కార్మిక సోదరులారా, మీరు చేస్తున్న పోరాటానికి మేమంతా అండగా ఉన్నాం. అధైర్యానికి లోనుకాకండి. కలిసికట్టుగా, న్యాయబద్ధంగా పోరాడి మన హక్కులను సాధించుకుందాం. ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని మరోసారి మనవి చేస్తున్నాం." అని హరీష్‌రావు ట్వీట్‌లో పేర్కొన్నారు.

కాగా.. నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అపోలో ఆస్పత్రిలో శంకర్ గౌడ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తైంది. బంధువులకు శంకర్ గౌడ్ మృతదేహాన్ని అప్పగించారు. స్వస్థలానికి శంకర్ గౌడ్ మృతదేహం తరలిస్తున్నారు.



నిన్న ఆర్టీసీ డ్రైవర్ పెట్రోల్ పోసుకొని నిప్పంటిచుకున్న విషయం తెలిసిందే. గత రెండ్రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఈ సమ్మెలో భాగంగా గురువారం రాష్ట్రంలోని అనేక చోట్ల కార్మికులు నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సమ్మెలో పాల్గొన్న శంకర్‌గౌడ్(55) పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయనను వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే 80 శాతం కాలినగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఈ రోజు అత్యక్రియలు జరగనున్నాయి. ప్రముఖ రాజకీయ నాయకులు హాజరుకానున్నారు.

## శంకర్ గౌడ్ ది ఆత్మహత్య కాదు..
## రేవంత్ సర్కార్ చేసిన హత్య

మొదటిపేజీ తరువాయి



అయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఆర్టీసీ కార్మికులు ఎవరూ అధైర్యపడవద్దని, బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని, ప్రభుత్వ మెడలు వంచి హక్కులు సాధించుకుందామని పిలుపునిచ్చారు.

## గ్రామలే దేశానికి పట్టుకొమ్మలు

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 24(డిడి9 వార్త) :** గ్రామ పంచాయతీలే ప్రజాస్వామ్యానికి అసలైన పునాదులని, గ్రామ స్వరాజ్యంతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఉప్లూర్ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామ ప్రజలందరికీ పంచాయతీ రాజ్ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలని, పంచాయతీ వ్యవస్థ బలంగా ఉన్నప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని ఆయన ఆకాంక్షించారు. గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని శైలేందర్ పిలుపునిచ్చారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రజలందరూ తమ సలహాలు, సూచనలు అందించాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, సిబ్బందిని సర్పంచ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తక్కురి శేఖర్, పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్, వార్డు సభ్యులు అజయ్, అనిల్, సంతోష్, సురేష్, సదుల్లా, అంజిత్, సతీష్, వి.ఓ.ఏలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



## వాహనదారుల తప్పిదాలతోనే ప్రమాదాలు

- **రోడ్డు ప్రమాదాలపై డీజీపీ శివధర్ రెడ్డి ఆందోళన**
- **ప్రమాదాల కారణంగా రోజుకు 20 కుటుంబాల్లో విషాదం**
- **ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనే ఘటనలకు ప్రధాన కారణం**
- **హెల్మెట్, సీట్ బెల్ట్ ధరిస్తే ప్రాణాపాయం తప్పే అవకాశం**
- **రహదారులపై సైన్ బోర్డుల కొరతను గుర్తించి పోలీసుల చర్యలు**
- **ఫీడర్ రోడ్ల నుంచి ప్రధాన రహదారులకు వచ్చే చోట అప్రమత్తత**
- **'ఎరైవ్-ఎలైవ్' కార్యక్రమం ద్వారా 16 శాతం తగ్గిన ప్రమాద మరణాలు**
- **ట్రాఫిక్ చలానాలపై డిస్కౌంట్లు, రాయితీలు ఉండవని వెల్లడి**
- **కఠిన నిర్ణయాల ద్వారానే ప్రమాదాలను ఆపగలమని స్పష్టం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో మెజారిటీ ఘటనలు వాహన చోదకుల స్వీయ తప్పిదాల వల్లే సంభవిస్తున్నాయని డీజీపీ శివధర్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. వాహనదారుల్లో కనీస సామాజిక స్పృహ లేకపోవడం, ట్రాఫిక్ నిబంధనలను బేఖాతరు చేయడం వల్ల విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల ధాటికి రోజుకు సగటున 20 కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన చెందారు. ఒక వ్యక్తి ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా, సామాజికంగా చితికిపోతుందనే విషయాన్ని ప్రతి డ్రైవర్ గుర్తుంచుకోవాలని సూచించారు. ఇటువంటి అకాల మరణాలను అడ్డుకునేందుకు పోలీస్ శాఖ శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని, ఇందులో భాగంగానే ప్రజల్లో అవగాహన పెంచేందుకు 'ఎరైవ్ఎలైవ్' అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన దేశంలో ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉండటానికి ప్రధాన కారణం అజాగ్రత్తేనని డీజీపీ విశ్లేషించారు. ఎడమ వైపు నుంచి ఓవర్ టేక్ చేయడం, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, మద్యం సేవించి స్టీరింగ్ పట్టడం వంటి ఉల్లంఘనలే మరణాలకు దారితీస్తున్నాయని మండిపడ్డారు. హెల్మెట్ ధరించడం లేదా సీట్ బెల్ట్ పెట్టుకోవడం వంటి చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని అధ్యయనాల్లో తేలిందని చెప్పారు. వ్యవస్థాపరమైన లోపాలను కూడా ప్రభుత్వం గమనిస్తోందని, ముఖ్యంగా ఫీడర్ రోడ్లు ప్రధాన రహదారుల్లో కలిసే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, సైన్ బోర్డులు లేకపోవడాన్ని గుర్తించామని వెల్లడించారు. అటువంటి బ్లాక్ స్పాట్స్ దగ్గర తక్షణమే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వాహనదారులు కూడా ప్రధాన రహదారిపైకి వచ్చే ముందు వేగం తగ్గించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే వారికి జరిమానాల విషయంలో ప్రభుత్వం ఇప్పుడు కఠినంగా వ్యవహరిస్తోందని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో మాదిరిగా చలానాలపై డిస్కౌంట్లు ఇస్తారని లేదా మొత్తానికే రద్దు చేస్తారని భావించి నిబంధనలు ఉల్లంఘించడం సరికాదని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇకపై చలానాల చెల్లింపులో ఎటువంటి రాయితీలు ఉండబోవని, కఠిన నిర్ణయాలు తీసుకుంటేనే మరణాల సంఖ్య తగ్గుతుందని నమ్ముతున్నామని చెప్పారు. పోలీసులు తీసుకున్న ముందస్తు చర్యల వల్ల 2025 మొదటి మూడు నెలలతో పోలిస్తే, ఈ ఏడాది ఇదే కాలంలో మరణాల సంఖ్య 2,102 నుండి 1,770కి తగ్గినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే సుమారు 16 శాతం మరణాలు తగ్గాయని, క్షతగాత్రుల సంఖ్యలో కూడా గణనీయమైన మార్పు వచ్చిందని తెలిపారు. భవిష్యత్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిబంధనలు పాటించని వారిపై మరింత నిఘా పెంచుతామని, వేల కుటుంబాల క్షేమం కోరి ఇలాంటి కఠిన చర్యలు తీసుకోక తప్పదని డీజీపీ వివరించారు.



## కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు ఊరట

మొదటిపేజీ తరువాయి

కేసులుగా పరిగణిస్తూ హైకోర్టు వీటిని కొట్టివేసింది. ఉద్యమ సమయంలో నమోదైన ఇటువంటి కేసులను ఇకపై కొనసాగించాల్సిన అవసరం లేదని న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

మలిదశ ఉద్యమ చరిత్రలో మిలియన్ మార్చ్ ఒక కీలక మైలురాయిగా నిలిచింది. అప్పట్లో ప్రభుత్వం విధించిన కఠిన ఆంక్షలను ధిక్కరించి లక్షలాది మంది ప్రజలు ట్యాంక్‌బండ్ వైపు తరలివచ్చారు. ఆ సమయంలో చోటు చేసుకున్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఉద్యమాన్ని నడిపించిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు సహా ఇతర ముఖ్య నేతలను బాధ్యులుగా చేస్తూ అప్పటి పాలకులు పోలీసుల ద్వారా కేసులు పెట్టించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ అక్రమంగా ఈ కేసులు బనాయించారని బీఆర్ఎస్ నేతలు అప్పటి నుంచి వాదిస్తూనే ఉన్నారు. న్యాయస్థానం తాజాగా ఇచ్చిన తీర్పుతో వారి వాదనలకు బలం చేకూరినట్లయింది. ఉద్యమకారులపై ఉన్న పాత కేసులను తొలగించడం వల్ల రాజకీయంగా కూడా ఇది చర్చనీయాంశంగా మారింది. విచారణ దశలో ఉన్న ఈ కేసుల నుంచి విముక్తి లభించడంతో గులాబీ దళం సంబరాలు చేసుకుంటోంది. తెలంగాణ సాధన కోసం సాగించిన నిస్వార్థ పోరాటానికి న్యాయం జరిగిందని బీఆర్ఎస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఈ తీర్పు తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఇప్పటికే రాష్ట్రంలో వివిధ ఉద్యమకారులపై ఉన్న పాత కేసులను ప్రభుత్వం దశలవారీగా వెనక్కి తీసుకుంటున్న తరుణంలో, నేరుగా హైకోర్టు జోక్యం చేసుకుని కేసులను కొట్టివేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజకీయ ఆకాంక్షలతో కూడిన ప్రజా పోరాటాలను నేరపూరిత చర్యలుగా చూడకూడదని కోర్టు వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు వంటి అగ్రశ్రేణి నేతలకు ఈ కేసు నుంచి విముక్తి కలగడం వల్ల చట్టపరమైన చిక్కులు తొలగిపోయాయి. ప్రజాస్వామిక నిరసనల్లో పాల్గొన్నందుకు ఎదుర్కొంటున్న వేధింపులకు ఈ తీర్పుతో స్వస్తి పలికినట్లయింది. సుదీర్ఘ పోరాట ఫలితంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రంలో, ఉద్యమ కాలం నాటి చేదు జ్ఞాపకాలు ఇలా ఒక్కొక్కటిగా కనుమరుగవుతుండటం పట్ల ఉద్యమకారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మిగిలిన పాత కేసుల విషయంలో కూడా ఇదే విధమైన సానుకూల ఫలితాలు వస్తాయని నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## కమలం గూటికి మల్లారెడ్డి కుటుంబం?

మొదటిపేజీ తరువాయి



సుమారు లక్ష మందితో నిర్వహించ తలపెట్టిన 'వందేమాతరం' ఆలాపన కార్యక్రమానికి సంబంధించి చర్చించేందుకే ఆమె వచ్చారని ప్రాథమిక సమాచారం అందుతోంది. అయితే, మరోవైపు రాజకీయాల్లో ఇలాంటి భేటీలు కేవలం సామాజిక కార్యక్రమాలకే పరిమితం కావనే చర్చ జరుగుతోంది.

**మల్లారెడ్డి ఫ్యామిలీ 'రూట్' మారుతోందా?**

ఇటీవలే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల సందర్భంగా మల్లారెడ్డి తన కోడలు ప్రీతిరెడ్డితో కలిసి ప్రధాని నరేంద్ర మోడీని మర్యాదపూర్వకంగా కలిశారు. రెండు రోజుల క్రితం కూడా స్టేట్ బీజేపీ చీఫ్ ఎన్.రామచందర్‌రావుతో ఆమె భేటీ అయ్యారు. అప్పటి నుంచే మల్లారెడ్డి కుటుంబం బీజేపీలో చేరుతుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ఊహాగానాలపై మల్లారెడ్డి ఇప్పటివరకు నేరుగా స్పందించనప్పటికీ, ఇప్పుడు ప్రీతిరెడ్డి స్వయంగా బీజేపీ ఆఫీస్‌కు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. భేటీ అనంతరం ప్రీతిరెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడితే.. ఇది కేవలం కాలేజీ కార్యక్రమం కోసమేనా లేక రాజకీయ రంగప్రవేశం కోసమా అన్నదానిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**కోడలి రాజకీయ అరంగేట్రానికి స్కెచ్..**

మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి భార్య అయిన ప్రీతిరెడ్డి గత కొంతకాలంగా మేడ్చల్ నియోజకవర్గ పరిధిలో చురుగ్గా తిరుగుతూ ప్రజలతో మమేకం అవుతున్నారు. వృత్తిరీత్యా వైద్యురాలైన ఆమె విద్యా సంస్థల నిర్వహణలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. మల్లారెడ్డి వయసు రీత్యా రాజకీయాలకు దూరమవ్వాలని భావిస్తుండటంతో తన వారసురాలిగా కోడలిని రాజకీయ అరంగేట్రానికి స్కెచ్ వేస్తున్నారు. ఇప్పటికే ప్రీతిరెడ్డి నియోజకవర్గంలోని పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఆమె తన మాటతీరుతో ప్రజలను ఆకట్టుకుంటూ రాజకీయ నాయకురాలికి ఉండాల్సిన లక్షణాలను ప్రదర్శిస్తున్నారు.






# కల్వకుంట్ల కవిత పార్టీ ప్రకటన సభకు అట్టహాసంగా ఏర్పాట్లు

- **పార్టీ ప్రకటన సభకు సర్వాంగ సుందరంగా ముస్తాబైన ప్రొఫెసర్ జయశంకర్ సార్ ప్రాంగణం**
- **గన్ పార్క్ లో అమరవీరులకు నివాళులర్పించి మునీరాబాద్ బయల్దేరనున్న కవిత**
- **ఉదయం 10 గంటలకు పార్టీ పేరు ప్రకటన, జెండా ఆవిష్కరణ**
- **33 జిల్లాల నుంచి తరలిరానున్న 50 వేల మంది కార్యకర్తలు**




**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయ పార్టీ ప్రకటనకు సర్వం సిద్ధమైంది మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్ లోని అద్వయ కన్వెన్షన్ (ప్రొఫెసర్ జయశంకర్ సార్ ప్రాంగణం) తెలంగాణ రాజకీయ చరిత్ర లో కొత్త అధ్యాయం లిఖించడానికి సర్వాంగ సుందరంగా ముస్తాబు అయ్యింది

రెండు దశాబ్దాల క్రితం తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో సంస్కృతిక విప్లవానికి ఊత కర్రగా నిలుస్తూ తెలంగాణ జాగృతిని స్థాపించిన కల్వకుంట్ల కవిత 20 ఏళ్ల తన ప్రజా జీవితంలో ఎన్నో మైలు రాళ్లను చేరుకున్నారు.. మరెన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారు

తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం స్వీయ రాజకీయ శక్తికి నేడు కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నారు

మునీరాబాద్ లోని అద్వయ కన్వెన్షన్ సెంటర్ తో పాటు దానిని ఆనుకునే ఉన్న 20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ సభా ప్రాంగణం నుంచి కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్నారు

- **శనివారం ఉదయం 7.30 గంటలకు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్ లోని తన నివాసం నుంచి ర్యాలీగా అమరవీరుల స్తూపానికి బయల్దేరుతారు**
- **ఉదయం 8.15 గంటలకు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తారు**
- **ఉదయం 8.25 గంటలకు అమరవీరుల స్తూపం వద్ద నుంచి బయల్దేరుతారు**
- **ఉదయం 9.30 గంటలకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్ లోని అద్వయ కన్వెన్షన్ హాల్ మెయిన్ గేట్ వద్దకు చేరుకుంటారు**
- **ఉదయం 10 గంటలకు పార్టీ జెండాను కల్వకుంట్ల కవిత ఆవిష్కరిస్తారు**
- **ఉదయం 10.05 గంటల ప్రసంగం ప్రారంభిస్తారు.. గంట 15 నిమిషాల నుంచి గంటన్నర పాటు కవిత గారు ప్రసంగిస్తారు**

**సభ ప్రాంగణం పేరు :**
ప్రొఫెసర్ జయశంకర్ సార్ సభా ప్రాంగణం
**ప్రధాన ద్వారం :**
ప్రజాకవి కాళోజీ నారాయణ రావు ద్వారము
**ఇతర ద్వారాల పేర్లు :**
రాణి రుద్రమ దేవి ద్వారము
మారోజు వీరన్న ద్వారము
చాకలి ఐలమ్మ ద్వారాము
**భోజన శాలల పేర్లు :**
సురవరం ప్రతాపరెడ్డి భోజన శాల
సమ్మక్క సారలమ్ భోజన శాల
షోయబుల్లా ఖాన్ (మీడియా) భోజన శాల
క్యాడర్, అతిథులకు 34 వంటకాలతో తెలంగాణ రుచులతో భోజనాలు




నూతన పార్టీ ప్రకటన అనంతరం పార్టీ కార్యకర్తలు, అతిథులకు తెలంగాణ రుచులతో భోజనాలు వడ్డించనున్నారు. మధ్యాహ్న భోజనం కోసం 34 రకాల వంటకాలను సిద్ధం చేశారు

నాన్ వెజ్ లో తలకాయ కూర, బోటీ ఫ్రై, తెలంగాణ మటన్ కర్రీ, నాటు కోడి పులుసు, బొమ్మిడాయల పులుసు, హైదరాబాదీ చికెన్ దమ్ బిర్యానీ, మిర్చి కా సాలాన్, ఎగ్ ఇగురు వడ్డించనున్నారు.

వెజిటేరియల్ లో బగరా బైంగన్ మసాలా కర్రీ, కందగడ్డ ఫ్రై, పాలకూర, మామిడి పప్పు, ఆలూ టామాటా, చామగడ్డ పులుసు, కట్ చారు సిద్ధం చేయనున్నారు.

తెలంగాణ ప్రత్యేక వంటకాలుగా పేరుగాంచిన మక్క గారెలు, జొన్న రొట్టె, సర్వపిండి, బూరెలు, అరిసెలను కూడా మెనులో చేర్చారు. వీటితో పాటు బగరా రైస్, వైట్ రైస్, సాంబర్, రోటి పచ్చడి, దోస, ఆవకాయ, మిర్చి బజ్జి, పచ్చి పులుసు, పపడ్, పెరుగు, రైతా కూడా ఉండనున్నాయి. మజ్జిగ, రాగి అంబలి కూడా పార్టీ అవిర్భావ సభలో అందుబాటులో ఉంటాయి. ఇక డిజర్ట్ లో బటర్ స్కాచ్ ఐస్ క్రీమ్, షాహి తుక్ డా, జిలేబీ పెట్టనున్నారు



## కౌలు రైతుల పట్ల నిర్లక్ష్యం మానాలి – సంగెపు బొర్రన్న

**డిడి 9 వార్త గుడిహత్నూర్ :**


తెలంగాణ రాష్ట్రంలో కౌలు రైతుల పరిస్థితి అత్యంత దుర్భరంగా మారిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. గుడిహత్నూర్ మండలంలోని లింగాపూర్, మాన్కపూర్ గ్రామాల కౌలు రైతులతో మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కౌలు రైతులు సాగు చేస్తున్న పంటలను తమ పేరుపై మార్కెట్ లో అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 2011 భూ ఆదికృత వాస్తవ సాగుదారుల చట్టాన్ని అమలు చేసి, కౌలు రైతులకు రుణహక్కు (LEC) కార్డులు అందజేయాలని కోరారు. ఈ కార్డుల ద్వారా భూ యజమానితో సంబంధం లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సులభంగా పొందే అవకాశం కలుగుతుందని, అలాగే అకాల వర్షాలు లేదా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే నష్టపరిహారం పొందే వీలు ఉంటుందని తెలిపారు. అదనంగా పండించిన పంటలను మార్కెట్ లో అమ్ముకునే సౌలభ్యం కూడా లభిస్తుందని పేర్కొన్నారు. భూమిలేని కౌలు రైతులకు రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలు కూడా వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 28,763 మంది కౌలు రైతులు ఉన్నారని, వారిలో చాలామంది అప్పుల బారిన పడి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కౌలు రైతులు అధిక వడ్డీకి ప్రైవేట్ అప్పులపై ఆధారపడాల్సి వస్తోందని, ఇది వారి ఆర్థిక పరిస్థితిని మరింత దెబ్బతీస్తోందని చెప్పారు. జిల్లాలోని బ్యాంకుల ద్వారా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, LEC కార్డుల ఆధారంగా పంట రుణాలు అందించేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో మొక్కజొన్న, తెల్ల జొన్న పంటలను విక్రయించేందుకు వ్యవసాయ అధికారులు ధృవీకరణ ఇచ్చి, రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు రఘు, పరుశురాం, జంగు, మారుతి, హన్మంత్, విశ్వనాథ్ పాల్గొన్నారు.



## ఆడబిడ్డ పుడితే రూ. 5 వేల కానుక

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 24(డీడీ9 వార్త) :**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కమ్మర్‌పల్లి మండలం హస కొత్తూరు సర్పంచ్ నలిమెల రేవతి గంగారెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. గ్రామంలో ఆడపిల్ల పుడితే తన వంతుగా రూ. 5 వేలు అందిస్తానని గతంలో ఇచ్చిన మాట ప్రకారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నలుగురు ఆడబిడ్డలకు పోస్ట్ ఆఫీస్ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాను సర్పంచ్‌గా ఉన్నంత కాలం గ్రామంలో ఆడపిల్ల పుడితే ఇదే రీతిన ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నరసయ్య మాట్లాడుతూ.. ఎన్నికల వేళ ఎన్నో హామీలు ఇస్తుంటారని, అయితే వాటిని ఈ విధంగా ఆచరణలో పెట్టడం అభినందనీయమని కొనియాడారు. ప్రభుత్వ నిధులతో చేసే అభివృద్ధి పనులు కాకుండా, సొంత డబ్బులతో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం సంతోషదాయకమని పేర్కొన్నారు. తమ బిడ్డల భవిష్యత్తు కోసం ఆర్థిక భరోసా కల్పించిన సర్పంచ్‌కు ఈ సందర్భంగా లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏనుగు మనోహర్, పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్, మెడికల్ ఆఫీసర్ స్పందన, హెచ్.ఈ.ఓ సత్యనారాయణ, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బంగ్లా లింబాద్రి పాల్గొన్నారు. అలాగే పాలకవర్గ సభ్యులు కనుక నరసయ్య, కుందేటి శ్రీనివాస్, పెద్ది సృజన్, అశోక్, గంగాధర్, కల్లెడ రాణి, జమున, పుష్ప, గంగుబాయి, కాంగ్రెస్ నాయకులు ఎడ్ల శ్రీకాంత్, గోపిడి రాజేశ్వర్, గ్రామస్తులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



## జాతర్ల గ్రామంలో ఘనంగా ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించిన బోథ్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ గారు

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ ఏప్రిల్ 24(డి డి 9):-**

పేదల సొంతింటి కల సాకారం కావాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా, బజార్‌హత్నూర్ మండలం జాతర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ముఖ్య అతిథిగా బోథ్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ గారు విచ్చేసి, స్థానిక సర్పంచ్ మెస్రం మాధవ్ తో కలిసి రిబ్బన్ కట్ చేసి గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులను ఆడే గజేందర్ గారు అభినందించారు.కార్యక్రమానికి వచ్చిన కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు మరియు గ్రామ ప్రజలకు లబ్ధి దారులు మడావి సుజాత ప్రవీణ్ కుమార్ దంపతులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొనారు.





## మాజీ ఎంపీ సోయాం బాపు రావు నేతృత్వంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసిన బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ ఏప్రిల్ 24(డి డి 9):-**

బోథ్ నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా, మాజీ ఎంపీ శ్రీ సోయాం బాపు రావు. నేతృత్వంలో బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ శ్రీ గొర్ల రాజు యాదవ్ , మాజీ డీసీసీబీ చైర్మన్ శ్రీ బోజా రెడ్డి. గౌరవ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక అంశాలను వినిపించారు.ఈ సందర్భంగా SC కార్పొరేషన్ పరిధిలో చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు ఇప్పటికే 5 యూనిట్ల స్కూటీలు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, దరఖాస్తులు అధికంగా ఉన్న నేపథ్యంలో మరిన్ని 5 యూనిట్లు మంజూరు చేయాలని కోరారు. దీనిపై మంత్రి గారు సానుకూలంగా స్పందించి, త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, బోథ్ పరిధిలోని SC కార్పొరేషన్ భూములకు సాగునీటి సౌకర్యాల లేమి కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కుంటలు, చెరువులు, ప్రాజెక్టులు లేక సాగు చేయలేకపోతున్న పరిస్థితిని మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో కరెంట్ సదుపాయంతో కూడిన పంప్‌సెట్లు సామాజిక సంక్షేమ పథకాల ద్వారా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, బోథ్ నియోజక వర్గం ఎస్టీ మరియు వెనుకబడిన ప్రాంతంగా ఉన్నందున ప్రత్యేక నిధులు కేటాయించి సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక ప్రతి మండల కేంద్రానికి అంబేద్కర్ భవనాలు నిర్మించాలని కూడా కోరగా, మంత్రి గారు దీనిపై సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఆదిలాబాద్ జిల్లాకు పర్యటించి శంకుస్థాపన కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు.



## విద్యతో పాటు క్రీడలూ అవసరమే

- **ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో కరాటే బెల్టింగ్ అవార్డుల ప్రదానం**

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 24(డీడీ9 వార్త) :**

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని కరాటే మాస్టర్ (బ్లాక్ బెల్ట్ 7 డాన్) రచ్చ శ్రీను బాబు అన్నారు. భీంగల్ పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో నిర్వహించిన కరాటే బెల్టింగ్ అవార్డుల ప్రధానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత పెరిగి మెదడు చురుకుగా మారుతుందని, తద్వారా చదువులో కూడా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో పిల్లలు ప్రతి రంగంలోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తూ వారిని శారీరకంగా, మానసిక సిద్ధం చేస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులను, అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వి.డి.సి అధ్యక్షుడు పతని కృష్ణ, పాఠశాల కరస్పాండెంట్ కె. జగదీష్, పవన్, టి. సురేష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.






## సాంకేతికతతోనే నేరాల నియంత్రణ : సీపీ సాయి చైతన్య

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 24(డీడీ9 వార్త) :**

ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పేర్కొన్నారు. ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూ నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పోలీసింగ్ నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని, సీసీ కెమెరాల ద్వారా అనుమానాస్పద కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ట్రాఫిక్ నియంత్రణలోనూ ఈ కెమెరాలు ఎంతో సహాయపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ప్రాంతాల్లో భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని, కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్,



సీట్ బెల్టు తప్పనిసరిగా ధరించాలని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వాడకం పూర్తిగా నిషేధమని హెచ్చరించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సమాజంలో డ్రగ్స్ రహిత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని మెసేజ్‌లను ఫార్వర్డ్ చేయవద్దని, బ్యాంక్ లావాదేవీల గోప్యతను పాటించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, సౌత్ రూరల్ సీఐ సురేష్ కుమార్, టౌన్ సిక్స్ ఎస్సై విట్టల్ రావు, ప్రజాప్రతినిధులు ఇమ్రాన్ ఖాన్, స్వామి గౌడ్, తురాజ్ ఖాన్, అమానుల్లా, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వడ్డీ వ్యాపారులపై కొరడా

- జిల్లావ్యాప్తంగా ఏకకాలంలో 45 బృందాలచే 15 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆకస్మిక దాడులు.
- అధిక వడ్డీలతో రైతులు ప్రజల నడ్డి విరుస్తున్న వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవు
- వ్యవసాయ భూములు తాకట్టు పెట్టుకుని, భూములు రాయించుకొని వడ్డీలకిస్తున్న వడ్డీ వ్యాపారాలు.
- 16 మండలాలలో దాడులు 7 పోలీస్ స్టేషన్లో పరిధిలో 15 కేసులు నమోదు.
- ఆకస్మిక దాడులతో వడ్డీ వ్యాపారుల వద్ద నుండి ప్రామిసరీ నోట్లు, చెక్కులు, పాస్ బుక్కులు, బాండ్ పేపర్స్, సేల్ డేట్స్ స్వాధీనం.

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : డిడి 9 వార్త న్యూస్**

రైతులు, అమాయక ప్రజల నడ్డి విరుస్తూ వారి రక్తాన్ని పిండి పీడుస్తున్న వడ్డీ వ్యాపారులపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ కొరడా ఝలిపించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లాలో ఏకకాలంలో 16 మండలాలలో 45 బృందాలచే దాదాపు వందమంది వడ్డీ వ్యాపారులపై ఆకస్మిక



దాడులు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 7 మండలాలలో దాదాపు 15 కేసులు నమోదు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. వ్యవసాయ భూములు తాకట్టు పెట్టుకుని, వ్యవసాయ భూములు తమ పేర్లపై రాయించుకొని వడ్డీ నిర్వహిస్తున్న వడ్డీ వ్యాపారుల పై దాడులు. దాడులలో వడ్డీ వ్యాపారాల వద్ద నుండి ప్రామిసరీ నోట్లో బాండ్లు చెక్కుబుక్కులు ఖాళీ పేపర్స్ స్టాంప్ పేపర్స్ సేల్ డేట్స్ లాంటివి స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. జిల్లా ఎస్పీ ప్రజలను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ అక్రమార్కుల ఆటలు కట్టడం చేయడం జరుగుతుంది అని, అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపే దిశగా జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు.

**పోలీస్ స్టేషన్లో వారిగా నమోదైన కేసులు మరియు నిందితుల వివరాలు**

ఆదిలాబాద్ టు టౌన్ పోలీస్ స్టేషన్లో ఒక కేసు
1. నాయిని సుదర్శన్, ఖుర్షీద్ నగర్.

తలమడుగు పోలీస్ స్టేషన్ లో 2 కేసు
2. కటకం రాజు, దేవాపూర్.
3. శ్రీనివాస్, దేవాపూర్.

మావల పోలీస్ స్టేషన్లో కేసు 2 కేసులు.
4. కుంటి లింగన్న, 170 కాలనీ.
5. దుర్గారెడ్డి, మావల.

నేరడిగొండ పోలీస్ స్టేషన్లో 3 కేసులు.
6. గంగారెడ్డి, తేజపూర్.
7. శ్రీనివాస్, నేరడిగొండ.
8. జుంబేరాత్ రాహుల్, నేరడి గొండ.

తాంసి పోలీస్ స్టేషన్లో 2 కేసులు
9. ఉప్లంచి నగేష్, కప్పర్ల
10. ఉప్లంచి గంభీర్, కప్పర్ల

ఇచ్చోడ పోలీస్ స్టేషన్లో 4 కేసులు
11. గౌతి సుందర్ సింగ్
12. గిట్టే మారుతి
13. కదమ్ సుదర్శన్
14. కదమ్ సాయి కృష్ణ సిద్ధాంత్

గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్లో ఒక కేసు
15. దహాలే పవన్, మన్నూరు గ్రామం.

మొత్తం 15 కేసులు నమోదయాయని వివరాలను వెల్లడించారు.



ప్రజల అవసరాలను లబ్ధి చేసుకుంటూ వడ్డీ పేరుతో నడ్డి విరుస్తున్న వడ్డీ వ్యాపారుల ఆగడాలను అరికట్టేలా జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఈరోజు ఇలాంటి ఆకస్మిక తనిఖీలను చేపట్టడం జరిగిందని, అధిక వడ్డీలకు ఇచ్చే వడ్డీ వ్యాపారులు ప్రజలను మోసం చేయడం మానివేయాలని సూచించారు.

## పిల్లల ఆరోగ్యానికి స్వర్ణామృత ప్రాశన: ధర్మకర్త నర్సింహారెడ్డి

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 24(డీడీ9 వార్త) :**

ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రం నర్సింగ్ పల్లి శుక్రవారం స్వర్ణామృత ప్రాశన కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రతి నెలా పుష్యమి నక్షత్రం రోజున నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా, నవజాత శిశువుల నుంచి 15 ఏళ్ల వయసు గల పిల్లల వరకు ఈ ఔషధాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన ధర్మకర్త శ్రీమాన్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ, వరుసగా 21 నెలల పాటు ఈ ఔషధాన్ని స్వీకరించిన పిల్లలకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని, శారీరక దృఢత్వం చేకూరుతుందని చెప్పారు. చిన్నపిల్లల్లో ఉండే అనారోగ్య సమస్యలు దూరమవుతాయని, ఎలాంటి రుగ్మతలు దరిచేరవని ఆయన వివరించారు. గత పది ఏళ్లుగా లక్షలాది మందికి ఈ ఔషధాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి పుష్యమి నక్షత్రం రోజున ఉదయం 7 గంటల నుండి 11:30 గంటల వరకు ఈ ఔషధాన్ని ఉచితంగా ఇస్తామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రోహిత్ కుమారాచార్య, నరాల సుధాకర్, రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారులకు రక్ష... స్వర్ణామృత ప్రాశన

- నర్సింగపల్లి క్షేత్రంలో ఘనంగా ఔషధ వితరణ

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 24(డీడీ9 వార్త) :**

ధర్పల్లి మండలం నరసింగపల్లిలోని ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో శుక్రవారం స్వర్ణామృత ప్రాశన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి నెల పుష్యమి నక్షత్రం సందర్భంగా చిన్నారులకు అందజేసే ఈ ఆయుర్వేద ఔషధ వితరణకు భారీగా స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన ధర్మకర్త శ్రీమాన్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన పసిబిడ్డల నుండి 15 ఏళ్ల వయస్సు గల పిల్లల వరకు ఈ ఔషధం ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. వరుసగా 21 నెలల పాటు ఈ స్వర్ణామృత ప్రాశనను తీసుకున్న బిడ్డల్లో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు శారీరక దారుఢ్యం సిద్ధిస్తుందని, దీర్ఘకాలిక రుగ్మతలు సైతం దరిచేరవని ఆయన వివరించారు. గత పది సంవత్సరాలుగా నిర్విఘ్నంగా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తూ ఇప్పటివరకు లక్షలాది మంది చిన్నారులకు ఈ ఔషధాన్ని అందించినట్లు ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో కూడా ప్రతి పుష్యమి నక్షత్రం రోజున ఉదయం 7 గంటల నుండి 11:30 గంటల వరకు ఉచితంగా ఈ ఔషధాన్ని పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రోహిత్ కుమారాచార్య, నరాల సుధాకర్, రమేష్, నరేష్ మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: టీయూసీఐ

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 24(డీడీ9 వార్త) :**

ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు టీయూసీఐ ఆధ్వర్యంలో శుక్రవారం సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లేష్ మాట్లాడుతూ... ప్రభుత్వాలు మారినా ఆర్టీసీ కార్మికుల కష్టాలు తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకోకపోగా, అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వారి సమస్యల పరిష్కారానికి సరైన చర్యలు చేపట్టడం లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సమ్మెపై చేస్తున్న వ్యాఖ్యలు కార్మికులను భయభ్రాంతులకు గురిచేసేలా ఉన్నాయని, సమ్మెను విచ్ఛిన్నం చేసే కుట్రలు మానుకోవాలని హితవు పలికారు. కార్మికులను అడ్డుకుంటే పీడీ చట్టం కింద కేసులు పెడతామంటూ హెచ్చరించడం సరైనది కాదని, బెదిరింపులకు దిగకుండా సమస్యల పరిష్కారానికి చర్చలు జరపాలని మల్లేష్ కోరారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ బోధన్ డివిజన్ నాయకులు ఎండీ ఇర్షాద్, పి.శంకర్, బి.సాయిలు, టీ.లాలూ, జి.దేవయ్య, గంగారాం తదితరులు పాల్గొన్నారు.






## ఓయూ పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఆర్. చత్రపతియాదవ్ ను సన్మానించిన పల్లెటూరు ప్రసాద్

**సిద్దిపేట (డీడీ9 వార్త):**

ఉస్మానియా విశ్వవిద్యాలయం పీజీ కళాశాల సిద్దిపేట ప్రిన్సిపాల్ గా ఆర్ చత్రపతి యాదవ్ నియమితులైన సందర్భంగా పూర్వ విద్యార్థులు పల్లెటూరి ప్రసాద్, బాయికాడి లక్ష్మణ్, తదితరులు శుక్రవారం సన్మానించారు. 2012 సంవత్సరంలో సిద్దిపేటలో పిజి కళాశాల ఏర్పాట్లు చత్రపతి యాదవ్ కృషి మరువలేనిదని దానికి గుర్తింపుగా నేడు ప్రిన్సిపల్ గా పదవి దక్కడం గర్వకారణం అన్నారు. పీజీ కళాశాలలో జర్నలిజం డిపార్ట్మెంట్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేసిన చత్రపతి యాదవ్ కు ప్రిన్సిపల్ గా పదోన్నతి దక్కడం సంతోషమన్నారు. శుక్రవారం ఫిజి కళాశాల ఆవరణలో వారిని కాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ రమేష్ పాల్వాయి, అసిస్టెంట్ ప్రొఫెసర్ మచ్చ శ్రీహరి, గణేష్ బాబు శ్రీనివాస్ మురళి తదితరులున్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం: కలెక్టర్ ఇలా త్రిపాఠి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 24(డీడీ9 వార్త) :**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, వసతి గృహ సముదాయం కోసం బోధన్ పట్టణ శివారులోని బెల్లాల్ ప్రాంతంలో ఎంపిక చేసిన స్థలాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వ సంకల్పం మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ ఒకే సముదాయంలో అత్యాధునిక వసతులు, నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ సమీకృత పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ల నిర్మాణానికి ఈ స్థలాన్ని ఖరారు చేసిన నేపథ్యంలో, శంకుస్థాపన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, బోధన్ నియోజకవర్గంలో స్కూల్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఈ రాందాస్, తహసీల్దార్ విఠల్ మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## నిజాయితీగా పని చేస్తే విజయం సాధించవచ్చు ...

- బాధితుల పక్షాన అడ్వకేట్స్ నిలబడాలి
- అడ్వకేట్స్ గా రాణించాలంటే లాంగ్వేజెస్ నేర్చుకోవాలి
- సిద్దిపేట బార్ అసోసియేశన్ అధ్యక్షుడు రమేష్ బాబు, లీగల్ సెల్ అత్తారిటీ డిప్యూటీ చీఫ్ శరత్ బాబు

**సిద్దిపేట డీడీ9 వార్త :**

నిజాయితీగా పని చేస్తే విజయం దానంతట అదే వరిస్తుందని సిద్దిపేట బార్ అసోసియేశన్ అధ్యక్షుడు రమేష్ బాబు, లీగల్ సెల్ అత్తారిటీ డిప్యూటీ చీఫ్ శరత్ బాబు అన్నారు. మూట్ కోర్టు ప్రాజెక్టు లో బాగంగ వినాయక లా కాళశాల విద్యార్థులు శుక్రవారం సిద్దిపేట లోని కోర్టు లను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో బార్ అసోసియేశన్ ప్రెసిడెంట్ రమేష్ బాబు మాట్లాడుతూ అడ్వకేట్స్ నిజాయితీగా పని చేయాలన్నారు. ఎక్కువ లాంగ్వేజ్లు నిర్చుకోవడం వల్ల, సబ్జెక్టు పై పట్టు సాధిస్తే కేసులను చాలా సులభంగా గెలవచ్చని సూచించారు. డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అత్తారిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చైల్డ్ మ్యారేజ్, ప్రొటెక్షన్ అవగాహన సదస్సులో లా విద్యార్థులు పాల్గొన్నారు. DSL డిప్యూటీ చీఫ్ శరత్ బాబు విద్యార్థులకు చైల్డ్ ప్రొటెక్టన్, చైల్డ్ మ్యారేజ్ పై ఉన్న చట్టలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేశన్ కార్యదర్శి సదానందం,లా కళాశాల చైర్మన్ రాజు, వైస్ ప్రిన్సిపల్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.




# చివరి దశకి చేరుకున్న రామ్ చరణ్ చిత్రం ..

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న "పెద్ది" సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రం మల్టీ స్పోర్ట్స్ నేపథ్యంతో ప్రత్యేకంగా రూపొందుతోంది. ఇప్పటికే చిత్రీకరణ దాదాపు పూర్తయిందని, ఒక పాట మినహా మిగతా భాగం ముగిసినట్లు చిత్రబృందం తెలిపింది. ప్రస్తుతం ఆ చివరి పాట చిత్రీకరణ కొనసాగుతుండగా, విడుదల తేదీపై కూడా స్పష్టత వస్తోంది. ముందుగా జూన్‌లో సినిమా విడుదల అవుతుందని ప్రకటించిన మేకర్స్, ఖచ్చితమైన తేదీని మాత్రం వెల్లడించలేదు.

తాజా సమాచారం ప్రకారం, ఇంకా పూర్తి చేయాల్సిన పనులు ఉండటంతో జూన్ 4న సినిమా విడుదల కష్టమని తెలుస్తోంది. దీంతో జూన్ 25ను విడుదల తేదీగా నిర్ణయించే అవకాశం ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అదే జరిగితే జూన్ 24 రాత్రి నుంచే ప్రీమియర్ ప్రదర్శనలు కూడా ఉండే అవకాశముంది. ఈ విడుదల తేదీపై చిత్రబృందం నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. అభిమానులు మాత్రం ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలతో ఎదురు చూస్తున్నారు. స్పోర్ట్స్ నేపథ్యంలో భావోద్వేగాలను కలిపి రూపొందుతున్న ఈ చిత్రం రామ్ చరణ్ కెరీర్‌లో మరో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుందని భావిస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తనదైన శైలిలో కథను తెరకెక్కిస్తున్నందున ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది.

ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారుతోంది. ఇప్పటికే చిత్రం నుండి విడుదలైన 'పహిల్వాన్ గ్లింప్స్'కు తోడు ఏఆర్ రెహమాన్ అందించిన 'చికిరి చికిరి', 'రేయ్ రేయ్ రా' వంటి పాటలు చార్ట్ బస్టర్లుగా నిలిచాయి. తాజాగా ఈ చిత్రంలో ఉండబోయే హైవోల్టేజ్ స్పెషల్ సాంగ్ కోసం చిత్ర యూనిట్ గ్లామర్ బ్యూటీ శృతి హాసన్‌ని ఫైనల్ చేసినట్టు విశ్వసనీయ సమాచారం.




# 30 ఏళ్ల నో కిస్సింగ్ పాలసీ బ్రేక్ చేయడంపై స్పందించిన కాజోల్..

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజోల్ 'దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే', 'కుచ్ కుచ్ హోతా హై' వంటి ఎన్నో క్లాసిక్ సినిమాలతో మూడు దశాబ్దాలుగా వెండితెరను ఏలుతున్నారామె. అయితే, తన సుదీర్ఘ కెరీర్‌లో కాజోల్ ఎప్పుడూ పాటించని ఒక నిబంధనను 2023లో తన OTT డెబ్యూ సిరీస్ 'ద ట్రయల్ ప్యార్, కానూన్, ధోఖా' కోసం బ్రేక్ చేశారు. అదే తన నో కిస్సింగ్ పాలసీ . ఈ వెబ్ సిరీస్‌లో తన కోస్టార్ జిషూ సేన్‌గుప్తాతో కాజోల్ ఒక ముద్దు సీన్‌లో నటించారు. దశాబ్దాల కెరీర్‌లో మొదటిసారి ఇలాంటి సీన్ చేయడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. తాజాగా, లిల్లీ సింగ్ పోడ్‌కాస్ట్‌లో పాల్గొన్న కాజోల్, ఆ నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందో క్లియర్ గా వివరించారు. కాజోల్ మాట్లాడుతూ.. "నిజం చెప్పాలంటే, అది నేను పోషించిన పాత్ర స్వభావం వల్ల తీసుకున్న నిర్ణయం. ఆ సీన్ కేవలం ఒక ముద్దు మాత్రమే కాదు, ఆ పాత్ర ఆలోచనలు, ఆమె ఆశలు, నిరాశలకు అది ఒక ప్రతిబింబం. స్క్రీన్‌ప్లేలో అది ఒక విడదీయలేని భాగం. ఆ సీన్‌ను తీసేస్తే ఆ పాత్రలోని ఒక ముఖ్యమైన కోణాన్ని కోల్పోయినట్లవుతుంది. అందుకే ప్రొఫెషనల్‌గా ఆ నిర్ణయం తీసుకున్నాను" అని చెప్పారు. ఈ సీన్ చేసేటప్పుడు తాను చాలా ఇబ్బంది పడ్డానని కాజోల్ అన్నారు. "థియరీ పరంగా ఆ సీన్ బాగుంటుందని నాకు అనిపించింది. కానీ సెట్స్ మీద నిలబడే వరకు నేను అది నిజంగా చేస్తానా లేదా 'కట్! ఇది జరగదు' అని చెప్పేస్తానా అన్న సందేహం నాలో ఉండిపోయింది. చాలా అసౌకర్యంగా అనిపించినప్పటికీ, ఒక నటిగా ఆ రోజు ఆ నిర్ణయం తీసుకోగలనని నాకు అనిపించింది" అని ఆమె చెప్పుకొచ్చారు. తన కెరీర్ ఆరంభం నుండి తాను తీసుకునే నిర్ణయాల విషయంలో చాలా స్పష్టంగా ఉంటానని కాజోల్ తెలిపారు. "నేను చాలా చిన్న వయసులోనే కెరీర్ స్టార్ట్ చేశాను. నాకు ఏం కావాలి, ఏం వద్దు అనే విషయంలో ఎప్పుడూ నిజాయితీగానే ఉన్నాను. నా నిర్ణయాల గురించి ఎక్కువగా ఆలోచించకుండా నా పని మీద మాత్రమే దృష్టి పెట్టేదాన్ని" అని ఆమె




# సందీప్ రెడ్డి వంగా కలల ప్రాజెక్ట్.. ఎందుకు తీయలేకపోయారంటే!

ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన చిత్రం 'మైఖేల్'. పాప్ లెజెండ్ మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా ఆంటోనీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ బయోపిక్ నేడు (ఏప్రిల్ 24) విడుదలైంది. అయితే, మొదట ఈ బయోపిక్‌ను 'యానిమల్' దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తీయాలనుకున్నారట. చాలా బలంగా కోరుకున్నప్పటికీ ఈ సినిమా (Michael Jackson Biopic) తీయడం తనకు ఇప్పటివరకూ సాధ్యపడలేదని గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. మైఖేల్ జాక్సన్ జీవితంలో ఒక సినిమాకు కావాల్సిన అన్ని ఎమోషన్స్, మలుపులు ఉన్నాయని సందీప్ అభిప్రాయపడ్డారు.





"మైఖేల్ జాక్సన్ జీవితం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. స్కూల్లో పాటలు పాడిన చిన్నప్పటి రోజుల నుంచి రంగు మార్చుకోవడం వరకు.. ఆయన ఎదుర్కొన్న పరిస్థితులు, సంగీత ప్రయాణం ఒక అద్భుతమైన కథ. ఒకవేళ ఈ బయోపిక్ తీస్తే మైఖేల్ జాక్సన్ పాత్రను ఎవరు పోషిస్తారు? అదే అసలైన ప్రశ్న. ఆ పాత్రను పోషించే సరైన నటుడు కనిపిస్తే.. అది నాకు కల నిజమవడం లాంటిదే. మైఖేల్ బయోపిక్‌ను ఎవరు డైరెక్ట్ చేసినా నేను (Sandeep Reddy Vanga) కచ్చితంగా చూస్తాను. ఎందుకంటే నాకు ఆయన గురించి తెలుసుకోవాలని ఉంది'' అని అన్నారు. మరోవైపు, మైఖేల్ జీవితంలోని వివాదాస్పద అంశాలను నిజాయతీగా చూపించడం కూడా సవాలుతో కూడుకున్న పని అని వంగా పేర్కొన్నారు. ఏదైనా విషయం నిరూపితమయ్యే వరకు ఏది సరైనదో, ఏది కాదో చెప్పడం కష్టమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం విడుదలైన 'మైఖేల్' సినిమాలో మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ కథానాయకుడిగా నటించిన విషయం తెలిసిందే.

# 'ధురంధర్' సక్సెస్.. ఆ నటుడికి రెమ్యూనరేషన్ డబుల్..

ప్రముఖ దర్శకుడు ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో వచ్చిన 'ధురంధర్' రెండు భాగాలు భారీ విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ చిత్రాల విజయంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు రాకేశ్ బేడీకి (Rakesh Bedi) దర్శక నిర్మాతలు సర్‌ప్రైజ్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. సినిమాలో ఆయన పోషించిన 'జమీల్ జమాలీ'కు మంచి ఆదరణ లభించడంతో ఆయనకు భారీ నగదు బహుమతిని అందజేసినట్లు సినీ వర్గాలు పేర్కొన్నాయి.

ఈ ఫ్రాంచైజీలో రాకేశ్ బేడీ తన అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడమే కాకుండా తన నటనతో అందరినీ మెప్పించారు. ఆయన చెప్పిన డైలాగులు సోషల్ మీడియాలో మీమ్స్ రూపంలో విపరీతంగా వైరల్ అయ్యాయి. ముఖ్యంగా సీక్వెల్ సినిమాలో ఆయన పాత్రలో వచ్చే మలుపు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ఆ పాత్ర కోసం ఆయన పడిన కష్టం, ఆయన అంకితభావాన్ని నిర్మాతలు ప్రత్యేకంగా ప్రశంసించారు. సినిమాను అంగీకరించినప్పుడు రెండు పార్ట్‌లకు కలిపి రాకేశ్ బేడీకి రూ.50 లక్షల పారితోషికంతో ఒప్పందం కుదుర్చుకుందట. సినిమా బ్లాక్‌బస్టర్ సాధించడంతో దర్శకనిర్మాతలు ఆయనకు రూ.1 కోటి బోనస్‌గా అందజేశారట.



సినీ పరిశ్రమలో సాధారణంగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకే పారితోషికం ఇస్తుంటారు. విడుదల తర్వాత ఇలా ఒక నటుడి ప్రతిభను గుర్తించి, స్వచ్ఛందంగా రెమ్యునరేషన్ డబుల్ చేయడం చాలా అరుదని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ హిట్ సినిమాలో రణ్‌వీర్ సింగ్‌తో పాటు అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, ఆర్. మాధవన్ లాంటి స్టార్‌లు నటించారు. బాక్సాఫీస్ వద్ద రూ.1700 కోట్లు సాధించింది.

# జవాన్ సీక్వెల్?

'కింగ్' సినిమాతో ప్రేక్షకులకి మాస్ యాక్షన్ వినోదాన్ని పంచేందుకు సన్నద్ధమవుతున్నారు హిందీ అగ్రహీరో షారుక్ ఖాన్. ఈ ఏడాది చివర్లో విడుదల కానున్న ఈ సినిమాని సిద్ధార్థ్ ఆనంద్ తెరకెక్కిస్తున్నారు. దీపికా పదుకొణె కథానాయిక. తాజాగా ఈ చిత్రంలో నటిస్తూనే షారుక్.. తన తదుపరి చిత్రానికి కూడా సన్నాహాలు చేస్తున్నారని తెలుస్తోంది. ఆయన నటించిన 'జవాన్' సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అట్లీ దర్శకత్వం వహించిన ఈ సినిమాకి ఇప్పుడు సీక్వెల్ రాబోతుందని తెలిసింది. దీనిని ఈ ఏడాదే సెట్‌స్పైకి తీసుకెళ్లాలని ప్రణాళిక రచిస్తుందట చిత్రబృందం. ''జవాన్ 2' స్క్రిప్ట్‌ను ఇటీవలే ఖరారు చేయడంతో సినిమా పట్టాలెక్కేందుకు మార్గం సుగమం అయ్యింది. ఇందులో శక్తిమంతమైన ప్రతినాయకుడి పాత్రకోసం దక్షిణాదిలోని ఓ అగ్రనటుణ్ని ఎంపిక చేయాలని బృందం చూస్తోందం''టూ బాలీవుడ్‌లో చర్చ నడుస్తోంది.



# అతని వల్ల నరకం అను

టాలీవుడ్ ఇండస్ట్రీలో ఎంతో మంది నటీమణులు ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో కొంతమంది మాత్రమే పాపులర్ అవుతూ ఉంటారు. అలాంటి వారిలో నటి ప్రగతి ఒక్కరు. ఇండస్ట్రీలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న ఆమె.. తల్లి, అత్త, వదిన లాంటి సహాయ పాత్రల్లో కనిపించి మెప్పించారు. ముఖ్యంగా బ్రహ్మానందం భార్యగా చాలా సినిమాల్లో కనిపించి తెలుగు ప్రేక్షకులను నవ్వించారు.

**కథ, పాత్ర నచ్చకపోతే అవకాశాలను వదులుకుంటా**

నిత్యం జిమ్ కు వెళ్తున్న ప్రగతి.. వెయిట్ లిఫ్టింగ్ లో కూడా పలు మెడల్స్ సంపాదించారు. అలాంటి నటి ప్రగతి తాజాగా షాకింగ్ కామెంట్స్ చేశారు. తన కెరీర్ కు సంబంధించిన కీలక విషయాలను పంచుకున్నారు. ఒక దర్శకుడితో పనిచేసిన సమయంలో ఎదురైనా అనుభవం వల్ల.. తాను నరకం అనుభవించానని వెల్లడించారు.

ఇకపై అతనితో మళ్ళీ పని చేయబోనని నిర్ణయం తీసుకున్నట్లు నటి ప్రగతి చెప్పుకొచ్చారు. కథ, పాత్ర నచ్చకపోతే అవకాశాలను వదులుకుంటానని పేర్కొన్నారు. అలాగే డబ్బు కంటే మంచి పాత్రకే ప్రాధాన్యత ఇస్తానని క్లారిటీ ఇచ్చారు. సినిమాలతో పాటు పవర్ లిఫ్టింగ్ పై కూడా దృష్టి పెట్టిన ఆమె.. ఫిట్ నెస్ తనకు ఎంతో ముఖ్యమని వివరించారు.



# మూడోసారి యంగ్ హీరోతో

బాలీవుడ్ యంగ్ అండ్ గ్లామరస్ బ్యూటీ అనన్య పాండే ప్రస్తుతం ఒక భారీ హిట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తోంది. వరుస సినిమాలు చేస్తున్నా, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను పలకరిస్తున్నా ఆమె కెరీర్‌లో ఒక బలమైన విజయం మాత్రం పడటం లేదు. అయినప్పటికీ అస్సలు నిరాశ చెందకుండా, ఏమాత్రం గ్యాప్ తీసుకోకుండా వరుస ఆఫర్లను అంగీకరిస్తూ దూసుకుపోతోంది. ప్రస్తుతం 'చాంద్ మేరా దిల్' షూటింగ్‌తో బిజీగా ఉన్న ఈ భామ, తాజాగా తన ఖాతాలో మరో ఆసక్తికరమైన ప్రాజెక్టును వేసుకుంది. బాలీవుడ్ యంగ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ నటిస్తున్న లేటెస్ట్ సినిమా 'నాగిల్లా'లో హీరోయిన్‌గా అనన్య పాండేను ఎంపిక చేసినట్లు సమాచారం. అయితే ఇప్పటికే వీరిద్దరూ కలిసి రెండు చిత్రాల్లో నటించారు, కానీ ఆ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయాయి. ఇప్పుడు మూడోసారి మళ్ళీ కలిసి నటిస్తుండటంతో, ఈ జోడీ మీద ప్రేక్షకుల్లో మిశ్రమ స్పందన వస్తోంది. ఈసారైనా ఈ జోడీ హిట్ కొడుతుందా లేదా అనేది ఇప్పుడు బాలీవుడ్ వర్గాల్లో పెద్ద చర్చగా మారింది. ఈ సినిమా కేవలం రొమాంటిక్ డ్రామా మాత్రమే కాదు, ఇందులో ఫాంటసీ, యాక్షన్ ఎలిమెంట్స్ కూడా పుష్కలంగా ఉన్నాయి. దీనికి మృగ్‌దీప్ సింగ్ లాంబా దర్శకత్వం వహిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ కరణ్ జోహార్ తన ధర్మప్రొడక్షన్స్, మహావీర్ జైన్ ఫిల్మ్స్‌తో కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సంగీతం విషయానికి వస్తే, ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ప్రీతమ్ చక్రవర్తి బాధ్యతలు చూసుకుంటున్నారు. సో, టీమ్ మొత్తం చాలా పవర్‌ఫుల్‌గా ఉంది కాబట్టి, ఈ సినిమాతో అనన్య తన సత్తా చాటాలని ఆశిస్తోంది. ఈ సినిమాను వాస్తవానికి వచ్చే ఏడాది నాగుల పంచమి పండుగ సీజన్‌లో విడుదల చేయాలని ప్లాన్ చేశారు. కానీ, షూటింగ్ , పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతుండటంతో, ఐదు నెలల ముందే రిలీజ్ చేసేందుకు మేకర్స్ నిర్ణయించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న వాలెంటైన్స్ డే గిఫ్ట్‌గా ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఫాంటసీ ప్రపంచంలో కార్తీక్ ఆర్యన్ యాక్షన్, అనన్య గ్లామర్ తోడైతే కచ్చితంగా ఈ సినిమా యూత్‌ను బాగా ఆకట్టుకుంటుందని చిత్ర బృందం నమ్మకంగా ఉంది. ఈసారైనా అనన్య పాండే తన బ్యాడ్ లక్‌ని పక్కన పెట్టి హిట్ కొడుతుందేమో చూడాలి.

